సాక్షి నల్లగొండ

గురువారం । 2 । ఫిబ్రవరి । 2023



'మందడి' హఠాన్మరణం

చండూరు వైస్ ఎంపీపీ మందడి నర్సింహారెడ్డి(57) బుధవారం గుండె పోటుతో మృతిచెందారు. - 18లో



వైభవంగా దోపోత్సవం

చెర్వుగట్టు జాతర సందర్భంగా బుధవారం తెల్లవారుజామున దోపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. - 18లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32°/16°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొంటౌన్ : నల్లగొండలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒప్పంద పద్ధతిలో ట్యూటర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అటానమీ, పిజియాలజీ, బయో కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో నాలుగు పోస్టుల చొప్పున, ఫార్మాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్ సబ్జెక్టుల్లో మూడు పోస్టుల చొప్పున ఖాళీలు ఉన్నట్లు వివరించారు. ఎమ్మెస్సీ (మెడికల్) పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీలోపు నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 6న ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

మిర్యాలగూడ డీఎస్పీగా బాధ్యతల స్వీకరణ



బదిలీపై వెళ్తున్న వెంకటేశ్వర్‌రావు నుంచి బాధ్యతలు తీసుకుంటున్న డీఎస్పీ వెంకటగిరి

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ డీఎస్పీగా పనకంటి వెంకటగిరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వై.వెంకటేశ్వర్‌రావు ఖమ్మం టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ కాగా హైదరాబాద్‌లో ఇంటిలిజెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న వెంకటగిరి మిర్యాలగూడ డీఎస్పీగా వచ్చారు. 1995లో హైదరాబాద్ సిటీ పరిధిలో ఎస్‌ఐగా విధుల్లో చేరిన వెంకటగిరి జంటనగరాల పరిధిలోనే 27ఏళ్లు పనిచేశారు. 2015లో సీఐగా, 2019లో డీఎస్పీగా ప్రమోషన పొంది ఇంటిలిజెన్స్ విభాగంలో పని చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని సీఐలు సత్యనారాయణ, నిగిడాల సురేష్, రాఘవేంద్ర్‌తో పాటు ఎస్‌ఐలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, చిరంజీవి

నకిరేకల్ : అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకెఎంఎస్) జిల్లా కార్యవర్గాన్ని నకిరేకల్‌లో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశాల్లో ఎనుకున్నట్లు ఆ కమిటీ బుధవారం ప్రకటించింది. జిల్లా అధ్యక్షుడిగా జ్వాలా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా అంబటి చిరంజీవి, ఉపాధ్యక్షుడిగా సిలివేరు జానయ్య, సహాయ కార్యదర్శిగా అంబటి వెంకటేషం, కోశాధికారిగా బీరెడ్డి సత్తిరెడ్డి, సభ్యులుగా పజ్జూరు ఉపేంద్ర, అనందరెడ్డి, కల్లూరి అయోధ్య, జానీ ఎన్నికయ్యారు.

హామీలు అమలు చేయాలి

చిట్యాల : రాష్ట్రంలోని భవన నిర్మాణ రంగంలోని కార్మికులకు పలు సందర్భాల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం (బీఎస్ఆర్‌కేఎస్) అధ్యక్షుడు దరిపెల్లి చంద్రం డిమాండ్ చేశారు. చిట్యాలలో బుధవారం నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 45 ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులకు ఆసరా పింఛన్లను మంజూరు చేయాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఉచితంగా మోటారు బైక్‌లను అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చెలిమెల రాములు, తోట్ల పరుశురాములు, నల్ల స్వామి, గంగాపురం రాజు, రవి, పాల భిక్షం, మంచాల గణేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సెమినార్లను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ గోపాల్‌రెడ్డి

ఎంజీయూ (నల్లగొండ రూరల్) : సెమినార్లను విద్యార్థులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. యూనివర్సిటీలో మార్చి 3, 4వ తేదీల్లో నిర్వహించే గణిత సెమినార్ పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గణితశాస్త్రానికి అన్ని విభాగాల పరిశోధనలు కీలకంగా మారిందన్నారు. కార్యక్రమంలో రవి, హైమావతి, మద్దిలేటి, ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోజనం కొంతే..



- నిరాశ పరిచిన కేంద్ర బడ్జెట్
- ఉమ్మడి జిల్లాకు ప్రత్యక్షంగా లేని కేటాయింపులు
- పరోక్షంగా చేకూరే ప్రయోజనమూ తక్కువే
- రైల్వే ప్రాజెక్టుల్లో దక్కేది శూన్యమే..!
- ఎంపీల విజ్ఞప్తులను పట్టించుకోని కేంద్రం





వేతన జీవులకు ఊరట

కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు ఊరట లభించింది. పన్నుల స్లాబుల్లో మార్పులు చేస్తూ బడ్జెట్‌లో కీలక ప్రకటన చేశారు. దీని ద్వారా జిల్లాలోని ఉద్యోగులకు, పెన్షనర్లకు మేలు చేకూరనుంది. రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపుతో పన్ను పరిధిలోకి వచ్చే వారికి లాభం చేకూరనుంది.

ఉపాధి హామీపై దెబ్బ

ఈ బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి పెద్దమొత్తంలో కోత విధించింది. ఈ ప్రభావంతో కూలీలపై పడనుంది. పని దినాలు దగ్గడం, లేదంటే కూలీ రేటు తగ్గడం వంటి ప్రభావం పడితే కొంత నష్టం తప్పదు.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కేంద్ర బడ్జెట్‌తో జిల్లా ప్రజలకు మేలు జరుగుతుందా? బడ్జెట్‌లో పేర్కొన్న వ్యవసాయం, అనుబంధ రంగాల్లో జిల్లాకు రైతులకు లాభం చేకూరుతుందా? అంటే ఇప్పుడే అవునని చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇతర రంగాల్లోనూ జిల్లాకు ప్రత్యేకంగా కేటాయింపులు లేవు. జిల్లా ఎంపీలు చేసిన విజ్ఞప్తుల్లో ప్రధానమైన రైల్వే లైన్లు, ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలు, బీబీనగర్ నడికుడి డబ్లింగ్, జనగామ వరకు ఎంఎంటీఎస్ పొడగింపు, బుల్లెట్ ట్రైన్ వంటి, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్స్‌టైల్స్ అండ్ హ్యాండ్లూమ్స్ వంటి వాటి విషయంలో పురోగతి కనిపించని పరిస్థితి నెలకొంది. గతేడాది ప్రకటించిన నదుల అనుసంధానాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడంతో గోదావరి – కృష్ణా అనుసంధానించేలా రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రయత్నాలకు కేంద్రం నుంచి చేయూత అందదని స్పష్టమైంది.

వ్యవసాయ రంగంలో కాస్త మెరుగు

వ్యవసాయ రంగాన్ని డిజిటల్ బాట పట్టిస్తామని, రైతుల పంటల దిగుబడి, అమ్మకాలు, మార్కెటింగ్ వంటి వాటికి సంబంధించి డిజిటల్ విధానం అమలు చేస్తామని ప్రకటించింది. అదేవిధంగా బడ్జెట్‌లో చిరు ధాన్యాల ఉత్పత్తి చేసే రైతులను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పినా, వాటి సాగు జిల్లాలో అంతంతమాత్రమే కావడంతో ఎక్కువ మంది రైతులకు ప్రయోజనం చేకూరే అవకాశం కనిపించడం లేదు. కానీ, ఇప్పటి నుంచి వాటి సాగు పెరిగే అవకాశ ఉంది. ఆత్మనిర్భర్‌లో హార్టికల్చర్ క్లీన్ ప్లాంట్ ప్రోగ్రాంకు చేయూతను ఇస్తామని పేర్కొన్నా గతేడాది నుంచి చేకూరిన ప్రయోజనం తక్కువనే చెప్పాలి. పశుపోషణ, మత్స్యసాగు, పాడి పరిశ్రమల రుణాలకు ప్రాధాన్యం ఇవ్వడం కొద్దిపాటి ఊరటే. స్వల్ప కాల పంట రుణాలకు 7 శాతం వడ్డీ రేటు ఇచ్చేలా, తనఖా లేని రుణం కింద సన్న, చిన్నకారు రైతులకు రూ.లక్ష నుంచి రూ.1.6 లక్షలకు పెంచారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం ఇవ్వనున్నారు. దీంతో జిల్లాలో ఉన్న 9.5 లక్షల మంది రైతులకు కొంత మేలు జరగనుంది. పండ్ల తోటల సాగులోనూ నల్లగొండ ముందువరుసలో ఉన్న నేపథ్యంలో కొంత ప్రయోజనం చేకూరవచ్చనే భావన వ్యక్తమవుతోంది.

పొదుపు పథకంతో మహిళలకు మేలు

కేంద్రం దేశవ్యాప్తంగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుతోపాటు టీచర్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పింది. నేషనల్ డిజిటల్ లైబ్రరీని కూడా ప్రోత్సహిస్తామని పేర్కొంది. యువత నైపుణ్యం కోసం కౌశల వికాస్ యోజన తదితర వంటివి పెడతామని ప్రకటించడం వల్ల జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో పాఠశాలల ఏర్పాటుతోపాటు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నిరుద్యోగులకు మేలు జరిగే అవకాశం ఉంది. మహిళల కోసం కొత్తగా ప్రవేశ పెట్టే పొదుపు పథకంతో కొంత మేలు జరుగనుంది. మహిళా సమ్మాన్ సేవింగ్ పథకం కింద డిపాజిట్లు రెండేళ్లపాటు చేసుకుంటే 7.5 శాతం స్థిర వడ్డీ అందనుంది. రూ.2 లక్షల వరకు డిపాజిట్ చేసుకుని అధిక వడ్డీ పొందడంతోపాటు మధ్యలో అవసరానికి దానిని విత్‌డ్రా చేసుకునే వీలు కల్పించడంతో మహిళలు ఈ పథకం వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. సొంతిల్లు లేనివారికి ఈ బడ్జెట్ ద్వారా ఆ కలను తీర్చుకునే అవకాశం కొంత మేరకు కలుగనుంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనకు భారీగా నిధులు పెంచుతున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో కొంత మేరకు సొంతింటి కల నెరవేరే అవకాశాలు ఉన్నాయి.

ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు లేవు



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ బుధవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు సంబంధించిన ఏ ప్రాజెక్టుకు కూడా నిధుల ప్రస్తావన చేయలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టు విషయంలో సవతితల్లి ప్రేమను చూపుతున్నాయి. రైల్వే స్టేషన్ల ఆధునీకరణకు కూడా ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం అన్యాయం. – నెల్లికంటి సత్యం, సీపీఐ జిల్లా కార్యదర్శి

బీబీనగర్ - నడికుడి డబ్లింగ్ పనుల ప్రస్తావన లేదు



కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, బీబీనగర్ – నడికుడి డబ్లింగ్ పనులకు సంబంధించిన ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం అన్యాయం. కాజీపేట నుంచి మాచర్ల వరకు ప్రతిపాదించిన రైల్వేలైన్‌కు ఎలాంటి నిధులు కేటాయించలేదు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. వ్యవసాయ రంగానికి అవసరమైన సబ్సిడీలు పెద్దగా లేవు. సాగునీటి ప్రాజెక్టులను కేంద్రం పూర్తిగా విస్మరించింది. – ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

విద్య, వ్యవసాయానికి బడ్జెట్ ఊరటనిచ్చింది



కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ విద్య, వ్యవసాయ రంగాలకు ఊరటనిచ్చేలా ఉంది. ప్రజల ఆరోగ్యం కోసం మంచి ఆహారం అందించేందుకు చిరుధాన్యాల పంటలను ప్రోత్సహించేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. ఏడు అంశాల అజెండాగా బడ్జెట్ ఉంది. ఇందులో సమ్మిళిత వృద్ధి, రూ.20 లక్షల కోట్ల వ్యవసాయ పరపతి అందేలా చూడటం, 150 నర్సింగ్ కళాశాలలను నెలకొల్పడం, ప్రభుత్వ పథకాలు సమాజంలోని చివరి వ్యక్తికి చేరడానికి ప్రాధాన్యం ఇవ్వడం, 740 ఏకల్య ఆదర్శ గురుకుల పాఠశాలను నెలకొల్పి అందులో 38,800 మంది ఉపాధ్యాయులను నియమించడం, రూ.79 వేల కోట్లతో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద గృహ వసతి కల్పించడం, పట్టణ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించడం వంటివి మేలు చేసేవే. సీనియర్ సిటిజన్లకు రూ. 30లక్షల వరకు పొదుపు అవకాశం కల్పించడం, ఉత్పత్తి దారుల పరోక్ష పన్నును తగ్గించడంతో ప్రయోజనం కలుగనుంది. మధ్యతరగతి వేతన జీవులకు ఆదాయ పన్నులో మార్పుతో కొంత ఊరట కల్పించినా పూర్తి తృప్తిని ఇవ్వలేదు. – ప్రొఫెసర్ కొప్పుల అంజిరెడ్డి, ఎంజీయూ ఆర్థికశాస్త్ర విభాగం

ధరణి సమస్యల పరిష్కారానికి కసరత్తు

- రికార్డులతో కలెక్టరేట్‌కు వచ్చిన తహసీల్దార్లు
- రెండు రోజులుగా సాగుతున్న ప్రక్రియ
- అన్నీ పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక ఇస్తున్న సిబ్బంది



కలెక్టరేట్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్లు, సిబ్బంది

నల్లగొండ : ధరణి పోర్టల్‌లో ఉత్పన్నమవుతున్న సమస్యల పరిష్కారానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ధరణిలోని నిషేధిత జాబితాలో ఉన్న సమస్యలతోపాటు వివిధ రకాలుగా ఇబ్బందులు పడుతున్న వారు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇలా వచ్చిన దరఖాస్తులు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. ఒక్కో మండలానికి సంబంధించి 100 పైచిలుకు దరఖాస్తులు ఉన్నాయి. సమస్యలన్నింటికీ ఒకేసారి పరిష్కారం చూపేందుకు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశారు. దీంతో అన్ని మండలాల తహసీల్దార్లు, సిబ్బందితో కలిసి రికార్డులు, కంప్యూటర్లతో కలెక్టరేట్‌కు వచ్చి సమస్యలను పరిష్కరిస్తున్నారు. రెండు రోజుల నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతోంది. శనివారంలోగా అన్నీ పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నారు.

పెద్ద ఎత్తున దరఖాస్తులు..

భూ సమస్యలపై ప్రతి సోమవారం గ్రీవెన్స్ డేకు రైతులు పెద్ద ఎత్తున కలెక్టరేట్‌కు వస్తున్నారు. ధరణి సమస్యలపై అధికంగా దరఖాస్తులు వస్తుండడంతో ఆ దరఖాస్తులను మండలాలకు పంపించడం, వాటిని చెక్‌చేసి తహసీల్దార్లు కలెక్టర్ లాగిన్‌కు పంపించడంలో జాప్యం జరగుతుండడంతో ఒకే సమస్యపై భూ యజమానులు పదేపదే గ్రీవెన్స్‌కు వచ్చి దరఖాస్తులు ఇస్తున్నారు. వాటన్నింటిని ఒకేసారి పరిష్కరించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

అన్నీ సక్రమంగా ఉంటే ఓకే..

ధరణి భూ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండలాల వారీగా రైతులు ఏఏ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారో ఆ రికార్డులను పరిశీలించి నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు సమర్పిస్తున్నారు. ఒకవేళ పరిష్కారానికి అనుకూలంగా లేకపోతే ఆ జాబితాను కూడా తయారు చేసి ఇస్తున్నారు. వాటిని అక్కడికక్కడే సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండడంతో అవి తిరిగి కలెక్టర్ లాగిన్‌లోకి వెళ్తున్నాయి. పరిష్కారానికి అనుకూలంగా ఉన్నటువంటి వాటిని ఓకే చేస్తూ మిగిలినవి తిరస్కరిస్తున్నారు.

నందికొండ మున్సిపాలిటీలో ముసలం



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నందికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్లు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలో ముసలం పుట్టింది. పాలకవర్గం ఏర్పడి మూడేళ్లు పూర్తికావడంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం కోరుతూ అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు బుధవారం నల్లగొండలో అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం సమరించారు. ఇప్పటి వరకు కొందరు అధికార పార్టీ కౌన్సిలర్లు అభివృద్ధి పనులకు సహకరించకుండా చేసిన తీర్మాణాలను, తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ వచ్చారు. ఇప్పుడు అవిశ్వాసానికి డిమాండ్ చేయడం పట్టణంలో చర్చనీయాంశమైంది. ఒకే పార్టీలో ఎప్పటి నుంచో ఇక్కడ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే గ్రూపులు కొనసాగుతున్నాయి. ఈ గ్రూపుల వల్ల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాగే కొనసాగితే అసలుకే మోసం వస్తుందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బదిలీలకు 3,641 దరఖాస్తులు

- ముగిసిన ఉపాధ్యాయుల ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ
- 7వ తేదీన సీనియార్టీ జాబితా విడుదల



నల్లగొండ : ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ బుధవారం అర్ధరాత్రి 12 గంటలతో ముగిసింది. బదిలీ కోసం జిల్లా వ్యాప్తంగా 3,641 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధ్యాయ బదిలీల కోసం గత నెల 28 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ కోరింది. మొదట 30వ తేదీ చివరి గడువు ఉండగా జిల్లా వ్యాప్తంగా 3512 మంది దరఖాస్తు చేసుకున్నారు. తర్వాత గత నెల 31 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు గడువు పొడిగించింది. దీంతో దరఖాస్తుల సంఖ్య 3,641కి చేరింది. అయితే దరఖాస్తు చేసుకున్నవాటిలో ఏమైనా తప్పిదాలు జరిగినా, సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయకున్నా వాటిని తిరిగి అప్‌లోడ్ చేసుకునేందుకు ఈ నెల 1వ తేదీ వరకు విద్యాశాఖ ఎడిట్ ఆప్షన్ కూడా ఇచ్చింది. దీంతో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల్లో కొందరు బుధవారం ఈ అవకాశాన్ని వినియోగించుకుని సరిచేసుకున్నారు.

6వ తేదీవరకు హార్డ్ కాపీల సమర్పణ..

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు అన్ని పత్రాల జాబితాను సంబంధిత కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, ఎంఈఓల ద్వారా ఈ నెల 6వ తేదీలోగా డీఈఓ కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది. వాటన్నింటిని పరిశీలించి ఈనెల 7న ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను విడుదల చేయనున్నారు.

పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

నల్లగొండ టౌన్ : పట్టణంలో నివాసం ఉంటున్న ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటి స్థలాలు, ఇంటి స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సీనియర్ నాయకుడు మల్లెపల్లి ఆదిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అనేకమంది నిరుపేదలు అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటూ అద్దెలు చెల్లించలేక నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని, ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని మరిచిపోయారని ఆరోపించారు. దరఖాస్తు చేసుకున్న వారందరికి రేషన్‌కార్డులు అందజేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లొడంగి శ్రవన్‌కుమార్, పబ్బు వీరస్వామి, పల్లా దేవేందర్‌రెడ్డి, గిరి రమ, గాదెపాక రమేష్, విశ్వనాథుల లెనిన్, ముండ్ల ముత్యాలు, ఎస్‌కె మదార్, ఎండీ యూసూఫ్, దోటి పాండరి, రేణుక, కౌసల్య, సుజాత, విఘ్నేశ్వర్ పాల్గొన్నారు.

కనుల పండువగా విష్ణుసహస్ర పారాయణం

- ఆకట్టుకున్న చినజీయర్‌స్వామి ప్రవచనాలు





మిర్యాలగూడ ఎన్ఎస్పీ క్యాంపులో ప్రవచిస్తున్న చిన జీయర్‌స్వామి, హాజరైన భక్తులు

మిర్యాలగూడ టౌన్ : శ్రీ బీష్మా ఏకాదశి సందర్భంగా స్థానిక ఎన్ఎస్‌పీ క్యాంపు గ్రౌండ్‌లో నిర్వహించిన శ్రీబీష్మాకాదశి ప్రయుక్త శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర విరాట్ పారాయణం బుధవారం రాత్రి కనుల పండువలా సాగింది. బీష్మా ఏకాదశి ఉత్సవ నిర్వహణ కమిటీ, వికాస తరంగిణి మిర్యాలగూడ కన్వీనర్, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ ఆధ్వర్యంలో చిన జీయర్‌స్వామి ప్రత్యేక పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆహోబిలం రామానుజ జీయర్ స్వామి, దేవనాద రామానుజ జీయర్ స్వాములు బీష్మా ఏకాదశి సహస్రనామ స్తోత్ర విరాట్ పారాయణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన జీయర్‌స్వామి ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. విష్ణుసహస్ర పారాయణంలో సభికులు గొంతు కలిపారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, బండారు కుశలయ్య, గార్లపాటి ధనమల్లయ్య, రంగా శ్రీధర్, గుడిపాటి శ్రీనివాస్, రేపాల మధు, రంగా లింగయ్య, సురేష్, రాయపూడి భవాని, మున్సిపల్ మాజీ చైర్మన్ తిరునగరు నాగలక్ష్మిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు తదితరులున్నారు.

తీర్థప్రసాద గోష్టి..

మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు శ్రీబీష్మా ఏకాదశి వేడుకల్లో భాగంగా త్రిదండి చినజీయర్‌స్వామి భక్తులకు తీర్థప్రసాద గోష్టిపై వివరించారు. ఈ గోష్టికి పట్టణ పరిసరాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ తీర్థ ప్రసాదాలు పొందారు.

మన బడికి కొత్తరూపు

నాడు



నేడు



నల్లగొండ రూరల్ : అభివృద్ధి చేయకముందు కనగల్ మండలంలోని బుడమర్లపల్లి పాఠశాల, అభివృద్ధి చేసిన తర్వాత ఇలా..

ప్రారంభోత్సవం



కార్పొరేట్ హంగులు



నల్లగొండ : కతాల్‌గూడ పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి. పాఠశాలలో డెస్క్ బెంచీలు

క్లుప్తంగా

యాదాద్రి ఇన్‌చార్జ్ ఈఓగా రామకృష్ణారావు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఇన్‌చార్జ్ ఈఓగా దేవాదాయశాఖ ఆర్‌జేసీ రామకృష్ణారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆలయ ఈఓగా విధులు నిర్వహిస్తున్న ఈఓ గీతారెడ్డి ఈ నెల 18వ తేదీ వరకు సెలవుల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రానికి ఇన్‌చార్జ్ ఈఓగా రామకృష్ణారావు వచ్చారు. గతేడాది పలుమార్లు ఈఓ గీతారెడ్డి సెలవుల్లో ఉన్నప్పుడు కూడా రామకృష్ణరావు ఇన్‌చార్జ్ ఈఓగా వ్యవహరించారు. బుధవారం జరిగిన ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభోత్సవం, పాతగుట్ట ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్యులు ఆయనకు ఆశీర్వచనం చేశారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో వ్యక్తి మృతి

నల్లగొండ క్రైం : అనారోగ్య కారణాలతో నల్లగొండని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ఓ వ్యక్తి మృతిచెందాడు. తిప్పర్తి మండలం నూకలవారిగూడేనికి చెందిన నూకల పరమేష్(44) పెద్దవూరలో ఉన్న సోదరి వద్దకు వెళ్లేందుకు తిప్పర్తిలో బస్సు ఎక్కాడు. నల్లగొండ బస్టాండ్‌కు చేరుకున్న తర్వాత పరమేష్ పెద్దవూర వైపు వెళ్లే బస్సు ఎక్కేందుకు ఎదురుచూస్తున్న క్రమంలో అకస్మాత్తుగా ఫిట్స్, గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలి మృతిచెందాడు. మృతుడి సోదరుడు లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

పేలుడు పదార్థం తిన్న ఆవు

- నోట్లో పేలడంతో మృతి

రాజాపేట : పేలుడు పదార్థం తిని ఓ ఆవు మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని రామచంద్రగూడెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు బక్కెన శివుడు వ్యవసాయ పొలం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు అడవిపందుల కోసం ఆహారంలో పేలుడు పదార్థం పెట్టారు. దానిని ఆవువెళ్లి తినడంతో నోటిలో పేలి మృతిచెందింది. సుమారు రూ.40వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు శివుడు ఆవేదనవ్యక్తం చేశాడు.

భక్తుల సౌకర్యాల కల్పనకు కృషి



బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డిగోవర్ధన్, చిత్రంలో ప్రభుత్వ విప్ సునీత, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

- దేశమంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటోంది
- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- యాదగిరిగుట్టలో బస్‌స్టేషన్ ప్రారంభం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు సీఎం కేసీఆర్ చేస్తున్నారని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. యాదాద్రి కొండకు దిగువన గండి చెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను ఆ సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి క్షేత్రానికి వచ్చే భక్తులకు ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు 5 ఎకరాల స్థలంలో సుమారు రూ.7కోట్ల వ్యయంతో సువిశాలమైన స్థలంలో బస్టాండ్ నిర్మాణం జరిగిందన్నారు. సీఎం కేసీఆర్ దేశంలో అద్భుతమైన ఆలయంగా యాదాద్రిని పునః



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న మంత్రి తదితరులు

నిర్మాణం చేశారన్నారు. ప్రస్తుతం యాదాద్రి క్షేత్రానికి 20వేలకుపైగా, శని, ఆదివారాల్లో 35వేలకు పైగా భక్తులు వస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో లక్షకు పైగా భక్తులు ఈ క్షేత్రానికి వచ్చి స్వామిని దర్శించుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో దేశమంతా మన రాష్ట్రం వైపు చూస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏ రాష్ట్రం అభివృద్ధి కాలేదని విమర్శించారు. కానీ సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో తెలంగాణను తక్కువ సమయంలోనే గొప్ప అభివృద్ధి చేశారని, దీంతో ప్రస్తుతం దేశ ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్టీసీ ఈడీ పురుషోత్తం నాయక్, ఆర్‌ఎం శ్రీదేవి, జాయింట్ కలెక్టర్ దీపక్ తివారీ, ఇన్‌చార్జ్ ఈఓ రామకృష్ణారావు, ఆర్డీఓ భూపాల్‌రెడ్డి, డిపో మేనేజర్ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ తదితరులున్నారు.

జలప్రసాదం ప్రారంభం

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా దివీస్ లాబోరేటరీస్ లిమిటెడ్ యాజమాన్యం ఏర్పాటు చేసిన జల ప్రసాదం (ఆర్వో వాటర్ ప్లాంట్)ను ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అంతకు ముందు ఆర్టీసీ ఈడీ పురుషోత్తంతో కలిసి చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



జలప్రసాదాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ గోవర్ధన్

సీపీఐ సీనియర్ నాయకుడు 'మందడి' హఠాన్మరణం



హైదరాబాద్‌లో నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు



నర్సింహారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని తదితరులు

- నివాళులర్పించిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, నేతలు చాడ, పల్లా



మందడి నర్సింహారెడ్డి (ఫైల్)

చండూరు : సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు, చండూరు వైస్ ఎంపీపీ మందడి నర్సింహారెడ్డి(57) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన చండూరు మండలం పుల్లెంలలోని స్వగృహంలో ఉండగా తెల్లవారుజామున కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే నర్సింహారెడ్డిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 9గంటలకు తుదిశ్వాస విడిచారు. నర్సింహారెడ్డికి భార్య, కూతురు ఉన్నారు. ఈయన 1984లో యువజన సంఘం (సీపీఐ అనుబంధం)లో చేరి యువజనుల హక్కుల కోసం పోరాటం చేశారు. 1993లో పార్టీ చండూరు కార్యదర్శిగా ఎన్నికై 2008 వరకు 15ఏళ్ల పాటు కొనసాగారు. అనంతరం జిల్లా కార్యవర్గ, రాష్ట్ర సమితి సభ్యుడిగా పనిచేశారు.

రెండు పర్యాయాలు వైస్ ఎంపీపీగా...

నర్సింహారెడ్డి 2000 నుంచి 2005 వరకు చండూరు మండల వైస్ ఎంపీపీగా, 2019లో రెండో సారి ఎంపీటీసీగా ఎన్నికై తిరిగి వైస్ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టి కొనసాగుతున్నారు.

నర్సింహారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

చండూరు వైస్ ఎంపీపీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మందడి నర్సింహారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని పుల్లెంల



చండూరు సీపీఐ కార్యాలయంలో మందడి మృతదేహంపై ఎర్ర జెండా కప్పుతున్న నాయకులు

గ్రామంలో నర్సింహారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మందడి మృతి తనను ఎంతగానే బాధించిందని కన్నీటిపర్యంతమయ్యారు. అంతకుముందు పార్టీ కార్యకర్తల సందర్శనార్థం మందడి మృతహాన్ని చండూరు సీపీఐ కార్యాలయంలో ఉంచగా పార్టీ జాతీయ కార్యకర్గ సభ్యులు చాడ కిషన్‌రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఐ, సీపీఎ జిల్లా కార్యదర్శులు నెల్లికంటి సత్యం, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, నలపరాజు సతీష్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. కొండాపురంలో కూడా పార్టీ గ్రామ కమిటీ సంతాపం ప్రకటించింది. కార్యక్రమంలో నాయకులు రత్నాకర్‌రావు. బచ్చనబోయిన గాలయ్య, పగిళ్ల శేఖర్, సంజీవ ఉన్నారు. అదే విధంగా ఎంపీడీఓ కార్యాలయంలో కూడా నర్సింహారెడ్డి చిత్రపటానికి ఉద్యోగులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాకూబ్ నాయక్, టీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె రవికుమార్, ఎంపీటీసీలు పల్లె వెంకన్న, గొరిగె సత్తయ్య, మంగమ్మ, ఏఈ రమేష్ ఉన్నారు.

చెర్వుగట్టులో వైభవంగా దోపోత్సవం



దోపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



హోమం పూజల్లో పాల్గొన్న ఈఓ తదితరులు

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున వైభవంగా దోపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామలింగేశ్వర శర్మ, సురేష్, సతీష్, శ్రీకాంత్‌శర్మ, అర్చక బృందం ఆధ్వర్యంలో వేదమంత్రాలతో దోపోత్సవం, మహా బలిహరణ, మహా పూర్ణాహుతి, ధ్వజారోహణం, ఏకాదశ రుద్రభిషేకం, జ్యోతి లింగార్చన, ఏకాంత సేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్య నిర్వాహక అధికారి నవీన్‌కుమార్ సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, శంకర్, శ్రీనివాసరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజయ్య, వెంకటయ్య, వంశీధర్‌రావు, రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదులకు గుణపాఠం చెప్పాలి

తుర్కపల్లి: మతోన్మాదులకు ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మహ్మద్ జాహంగీర్, కల్లూరి మల్లేశం, పోతరాజు జాహంగీర్, కొక్కొండ లింగయ్య, రాజు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సీతారాములు

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు

త్రిపురారం : మారుతున్న ఆహారపు అలవాట్లను దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్‌లో జిల్లాలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు, నాణ్యమైన పంటను పండించవచ్చన్నారు. ప్రస్తుతం సేంద్రియ ఎరువులతో పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో అధిక ఆదాయం పొందవచ్చాన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

రసాయ ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడకం వల్ల మొక్కలకు కావాల్సిన జీవ రాశులు పూర్తిగా క్షీణించి నేలకు నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ భరత్, జిల్లా జీవ వైవిధ్య నిపుణులు సురేష్ గుప్త, పర్యావరణ నిపుణులు దుశ్చర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఊరికి కీడొచ్చిందని..

- ఇళ్లు విడిచిన చందుపట్ల ప్రజలు

నకిరేకల్ : ఊరికి కీడు వచ్చిందని నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామస్తులు బుధవారం ఉదయం ఇళ్లు విడిచి వన భోజనాలకు వెళ్లారు. గ్రామంలో 15రోజుల నుంచి వివిధ కారణాలతో 15 మంది చనిపోయారని భయాందోళనకు గురవుతున్నారు.ఈ నేపథ్యంలో గ్రామ పెద్దలు, ప్రజలు కుర్చొని చర్చించి ఒక నిర్ణయం తీసుకున్నారు. ఈ చావుల పరిహారం కోసం గ్రామ పెద్దలు ఓ జ్యోతిష్యుడు దగ్గరకు వెళ్లారు. సదరు జ్యోతిష్యుడు ఒక రోజు ప్రజందరు ఊరు విడిచి వనభోజనాలకు వెళ్లాలని సూచించారు. ఆ మేరకు గ్రామస్తులు తెల్లవారుజామున ఊరు విడిచి చెట్ల కింద, వ్యవసాయ బావుల వద్ద వంటలు చేసుకుని అక్కడే భోజనాలు చేశారు. దీంతో చందుపట్ల గ్రామం అంతా బోసిపోయింది. ప్రభుత్వ పాఠశాలకు కూడా పిల్లలు రాకపోవడంతో ఉపాధ్యాయులు ఖాళీ కూర్చున్నారు. గ్రామంలో బొడ్రాయి కిందికి ఉందని అందుకు ఇలాంటి పరిస్థితులు వచ్చి ఉండొచ్చని ప్రజలు అంటున్నారు. వనభోజనాలఇళ్లకు వచ్చిన ప్రజలు కళ్లాపి చల్లుకున్నారు. గ్రామంలో ఒక దగ్గర రాజేసిన నిప్పు (బొగ్గు) కొనుగోలు చేసి ఇంటికి తీసుకువచ్చి పొయ్యి వెలిగించుకున్నారు.



చెట్లకింద వంట చేసుకుంటున్న చందుపట్ల గ్రామస్తులు

టి వ్యాలెట్ వినియోగంపై అవగాహన

ఎంజీయూ(నల్లగొండ రూరల్) : ఉపకార వేతనాలు పొందే విద్యార్థులు టి వ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని యూనివర్సిటీ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ అంజిరెడ్డి సూచించారు. బుధవారం యూనివర్సిటీలో నిర్వహించిన టి వ్యాలెట్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవి, శేఖర్ రెడ్డి, కృష్ణ, ఫణి, మురళి తదితరులు పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న కమలానందభారతీ స్వామి



స్వామివారి సన్నిధిలో స్వామి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని భువనేశ్వరి పీఠాధిపతులు కమలానంద భారతీ స్వామి బుధవారం దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ హిందూ దేవాలయాల పరిరక్షణ, గో సంరక్షణ, ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ, సనాతన ధర్మ రక్షణకై బాసర నుంచి కర్ణాటక రాష్ట్రంలోని హంపి విజయనగరం వరకు పదివేల కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కమాలనంద భారతీ స్వామిజీ వెంట శ్రీతీర్థ పీఠాధిపతులు వివేకానంద స్వామిజీ, హిందూ దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కట్టెగొమ్ముల రవీందర్‌రెడ్డి, తదితరులున్నారు.

రేపు డైట్‌లో సర్టిఫికెట్ల పరిశీలన

నల్లగొండ : డీఈఈ సెట్ 2022 అర్హత సాధించిన డీఈఐఈడీ , డీపీఎస్ఈ రెండేళ్ల కోర్సుకు సంబంధించి నల్లగొండ డైట్ కళాశాలలో శుక్రవారం మూడో విడత సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ నర్సింహ ఒక ప్రకటనలో తెలిపారు. 3న సర్టిఫికెట్ల పరిశీలన, అర్హులైన వారు 6 నుంచి 9వ తేదీలోపు ఆప్షన్లు ఎంచుకోవాలని , 14న సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

ధ్వజారోహణం.. దేవతాహ్వానం



పాతగుట్ట ఆలయ వీధుల్లో స్వామివారి ఊరేగింపు

- పాతగుట్టలో రెండో రోజుకు చేరిన బ్రహ్మోత్సవాలు
- నేడు అలంకార సేవ.. ఎదుర్కోలు మహోత్సవం

యాదగిరిగుట్ట : పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం విశేష పర్వాలు జరిగాయి. ఉత్సవ విశిష్టతను లోకమంతా చాటి, సకల దేవతలను ఆహ్వానించే తతంగాన్ని ఆచార్యులు నిర్వహించారు. అంకురార్పణ తదుపరి నిర్వహించే వేడుక ధ్వజారోహణం. భగవానుడి వాహనం అయిన గరుడ ఆళ్వారును కొత్త వస్త్రంపై చిత్రించి పూజాదికములు నిర్వహించి, గరుడ ఆళ్వారుడికి ప్రత్యేక ఆరాధన చేశారు. ఊరేగింపుగా ధ్వజ పటాన్ని ధ్వజ స్తంభం వరకు తీసుకెళ్లారు. అక్కడ గరుడ ఆళ్వారుడికి ఇష్టమైన పదార్థాలను (గరుడ ముద్దలను) నైవేద్యంగా సమర్పిచారు. గరుడస్వామికి ఇష్టమైన వంటకాల సమర్పణలో అష్టరాగాల ఆలాపన చేసి, ధ్వజారోహణం నిర్వహించారు. ఈ కార్యక్రమంతో ఉత్సవ వైభవం విశ్వజనులకు చేరిందని ఆచార్యులు చెప్పారు. గరుత్మంతుడికి సమర్పించిన నైవేద్యం ప్రసాదాలను ఆచార్యులు భక్తులు, నిర్వాహకులకు అందజేశారు. ధ్వజారోహణం దర్శించిన భక్తులకు పాపవిమోచనం, విష్ణులోక ప్రాప్తి, మనోరథసిద్ధి వంశావృద్ధి, సమాజ శ్రేయస్సు తదితర విశేష ఫలితాలు కలుగుతాయని ఆచార్యులు తెలిపారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ రామకృష్ణారావు, ఆచార్యులు, అధికారులు పాల్గొన్నారు.



భేరీ పూజ నిర్వహిస్తున్న ఆచార్యులు

సాయంకాలం...

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిత్యారాధనల అనంతరం వేదపారాయణికులచే వేదపారాయణం, మూలమంత్ర, అనుష్టానముల గావించారు. అనంతరం సాయంత్రం బేరీపూజ, దేవతాహ్వానం ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞాచార్య బృందం, అర్చకులు, పారాయణికులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

భేరీ పూజ.. దేవతాహ్వానం..

శబ్దం భగవంతుని స్వరూపం కనుక శబ్దనాముల తో భగవానుని ఆరాధించుట ఈ వేడుకలోని ప్రత్యేక అని ఆచార్యులు పేర్కొన్నారు. ఆయా రాగ, తాళ, వాయిద్యములతో వేద మంత్ర ఉచ్చారణలతో బ్రహ్మాది దేవతలను ఆహ్వానించి ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించుటే ఈ దేవతాహ్వానం వేడుకని ఆచార్యులు వెల్లడించారు.

నేడు అలంకార సేవ.. ఎదుర్కోలు

నృసింహుడికి ఇష్టమైన అలంకార సేవలు గురువారం ప్రారంభం కానున్నాయి. అలంకార ప్రియుడైన నృసింహుడిని ఉదయం హవన పూజలు జరిపించిన తరువాత సింహ వాహనంపై అలంకారం చేసి తిరువీధుల్లో సేవ నిర్వహిస్తారు. ఇక రాత్రి శ్రీస్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అశ్వవాహనంపై ఊరేగుతూ తిరువీధుల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.